


✷ 'బావ వచ్చాడు కాళ్ళు కడుక్కుందుకు నీళ్ళు తెండే!'

'అక్కా, ఏమీ అక్కరలేదుకే. బూట్లు [illegible] ఉండవు' అని కూర్చుని గబగబ బూట్లు విప్పేసి మేజోళ్ళతో లోపలికి పోబోయాడు సారథి.

'[illegible] కాళ్ళు కడుక్కుని [illegible]దుదువుగాని ఉండు.'

'చాదస్తమా మావయ్యా నీకూ్కడా! బయలుదేరినప్పటినుంచి బూట్లతో మగ్గిపోయిన కాళ్ళు ఎలా ఉంటాయో ఎరగని వాడివా?'

లోపలినుంచి వచ్చి గుమ్మానికి కడ్డంగా నిలబడింది కళ్యాణి. 'ఆగు బావా, అమ్మ నీళ్ళు తెస్తోంది.'

'స్నానం అనక!'

గలగల నవ్వింది కళ్యాణి. 'స్నానానిక్కాదు స్వామీ, తమరి పాదప్రక్షాళనానికి.'

చిరాకేసింది సారథికి. 'అందరికీ నా కాళ్ళగురించి అంత శ్రద్ధేమిటోయ్ — తప్పుకో ముందు! కావాలంటే నా కాళ్ళు చూపించనా, తమలపాకుల్లా రాక్‌ఫెల్లర్ పాదాల్లాగా ఉన్నాయి.'

'ఆయన కాళ్ళతో నీ కెప్పుడు పనొచ్చిందో?'

'ఛప్! ఇంతింత మాటలన్నాక చస్తే కడుక్కోను. తప్పుకుంటావా లేదా?'

'ఊహూఁ'

'ఇదుగో చూడు కళ్యాణీ, నాకు సిగ్గు లేదు. కొత్తగా సిగ్గు నేర్చుకున్నదానివి నువ్వే—వచ్చేస్తున్నాను.'

గభాలున తప్పుకుంది కళ్యాణి.

అడుగేయబోయిన సారథికి ఎదురుగా నీళ్ళ చెంబుతో ఎదురయింది సరస్వతి.

'ముందు కాళ్ళు కడుక్కో నాయనా' అంది.

సారథికి నిలువునా కోపం వచ్చేసింది. 'భోజరాజుకి సాలభంజికలు మెట్టుమెట్టుకీ అడ్డువచ్చాయిట. నువ్వు ఇప్పటికీ మూడవ దానివి నన్నడ్డుకునేందుకు! ... నేను కడుక్కోను. ఇలాగే వెడతాను లోపలికి.'

'సరే నీ ఇష్టం. మొండివాడికి చెప్పగలిగేవారెవరు? నిన్న మీ పెద్దబావమరిది కాళ్ళు కడుక్కోకుండా వచ్చాడు ... తెల్లవార్లూ పసిపిల్ల కక్కుటిర్చిపోయింది. కంటికి కునుకు లేదు.'

ఆగిపోయాడు సారథి. 'అదెందుకుట?'

'అడ్డమయిన కాళ్ళతోనూ పురిటి గదిలోకి వెడితే పిల్లలు పోరుపెడతారు. తప్పుకోవే కళ్యాణీ, లోపలికి వెడతాట్ట. ఏడుపు ఆపించడం కూడా నీవంతే నీ కూతుర్ని.'

ఆవిడ చేతిలోంచి చెంబుతీసుకుని గబగబ వాకిట్లోకి వెళ్ళాడు సారథి.

కళ్యాణి పకాలున నవ్వింది. సరస్వతి కళ్ళతోనే మందలించింది. 'అసలే తిక్క

మనిషి— నన్నెక్కు చూడకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోయినా పోగలడు.'

'వెడితే ఆయనకేగా ఇబ్బంది! భార్య మీద, పిల్లమీద పాటలు పాడుకుంటూ కూర్చోవాలి. చుట్టుపక్కలవాళ్ళు ఊరుకుంటారేమిటి.'

కాళ్ళు కడుక్కుని లోపలికి వచ్చాడు సారథి.

'ముద్దుగాని పద. యువరాణి పుట్టేసింది—ఇక నువ్వు రాజ్యాన్ని సంపాయించడమే తరువాయి.'

'ముందు నీకొక ఫకీరుని వెతికాక!'

ఫక్కున నవ్వింది కళ్యాణి. 'సర్లే, ఇప్పటికొచ్చిన ఒక్కడు చాలు నంటున్నారు నాన్నగారు.'

'కళ్యాణీ' అంది సరస్వతి హెచ్చరికగా.

'రా, రా చూద్దువుగాని. చాలా అదృష్టవంతులం బావా, నీ పోలిక రాలేదు. భగవంతుడు మనల్ని దయతలిచాడు.'

'అవును కళ్యాణీ, ఒక్కొక్కసారి నాకు నిద్రకూడా వచ్చేదికాదు. మీ అక్కయ్యకేమో నువ్వంటే చాలా ఇష్టమూ. అచ్చం నీలానే పుడితే నా గతేం కాను. అదృష్టవంతుడ్ని.'

'సర్లేవయ్యా స్వామీ! నీ పోలిక కాదన్నను గాని నా పోలికా లేదన్నారా? అచ్చం నా పోలికే! చూపించవే అక్కయ్యా నీ హేమమాలినిని.'

'పేరు పెట్టేశావేమిటి—చెట్టంతవాడిని నేనుండగానే!'

'సరె నీకు తెలియాలంటే లేటెస్టు భాష మాట్లాడకూడదులాగుంది. నేచెప్పిన పేరు సినిమా ఆవిడదిలే!'

తల్లి డొక్కలోంచి బయటపడేసేందుకు చిరాగ్గా ఓపికలేని ఒక ఏడుపు ఏడుస్తూ ముడుచుకు పోతున్న పాప అగపడింది సారథికి.

'ఎంత చిన్నదో' అన్నాడు మురిపెంగా చూస్తూ.

'లేకపోతే నీ అంతా ఉంటుందనుకున్నావా?'

ఆమె మాటలు పట్టించుకోలేదు సారథి. కూతుర్ని చూడటం అయిపోయాక శ్యామల మీదికి మళ్ళిందతని చూపు. ఎప్పుడో రెండునెలల క్రితం చూశాడు. అప్పటికి నిండుగోదావరిలా ఉండి కూర్చుంటే మంచోలేకపోయేది!

ఇప్పుడో—గాలి తీసేసినట్లయిపోయింది. కాని ఇప్పటి ఈ స్థితిలో అతని కంటికి మరీ అందంగా అగపడింది. కష్టపడి తను కన్న పాపని దగ్గరకు లాక్కుంటున్న ఆమె కళ్ళలోని తృప్తి చూస్తే అతనికి ముచ్చటేసింది.

దగ్గరగా, వాళ్ళిద్దరికీ అతి దగ్గరగా ఉండాలన్న అతని కోరిక కళ్యాణిఉండటంతో ఆగిపోయింది.

తనవంక అతను చూడటం గ్రహించుకున్న కళ్యాణి 'ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటారు లాగుంది.' అని నవ్వి బయటికి వెళ్ళిపోతూ 'అక్కయ్య మంచం తాకినట్లు తెలుస్తే బామ్మ తలనిండా స్నానంచేయించుతుందని గుర్తుచేయక్కయ్యా!' అంది.

చంటిపాప ఏడవటంతో సారథి కళ్ళు మళ్ళీ దానిమీదికి వచ్చాయి. దగ్గరకు లాక్కోబోతున్న తల్లి వేళ్ళు తగలగానే పాలనుకుని నోరు తెరిచి వెతుక్కుంటోంది. కానీ పుకి నోటికేమీ తగలకపోవటంతో ఏడుపు మొదలెట్టింది.

'ఎంచక్కా ఏడుస్తోందో చూడండి. వినాలొచ్చారని దానికి తెలుసులా ఉంది! నిన్న నల్లా పాలివ్వకపోయినా ఏడిచిందనుకున్నారా?'

ఒక మూలనుంచి సిపాయిలా ఏడుస్తుంటే శ్యామల నవ్వుతూ కబుర్లు చెపుతుండడం అతనికేమీ బాగాలేదు 'సొది తరువాత చెబుదువుగాని ముందు దానికి పాలివ్వరాదూ.'

నవ్వింది శ్యామల 'మీరవతలికి వెళ్ళండి మరి.'

'మరినీ, వారినీ—పెద్దజోకు. నువ్వు... పిల్లకి పాలివ్వడానికి నేనవతలికి పోవాలా? నైస్ గుడ్నెస్'

'అటు తిరిగి కూర్చోండి పోనీ!'

'మళ్ళీ అదేమాట—అసలు నవ్వేలా...'

'సిగ్గులేని మాటలు! పిల్ల ఏడుస్తోంది వినబడడంలేదూ! నాకేం అలా ఏడ్చి ఏడ్చి సొమ్మొచ్చి నిద్రపోతుంది పాపం.'

ఖంగారువచ్చాడు సారథి. 'సరే, సరే పాలిచ్చుకో! ఇటు తిరుగుతున్నాలె! మధ్య మధ్య చూడవచ్చా పోనీ? ఐమీన్—పాలుతాగే పాపాయిలంటే చాలా ఇష్టం నాకు.'

'పిల్లేదు.'

అసెప్పు తిరిగి కూర్చున్నాడు. గాని తోచలేదు సారథికి. హఠాత్తుగా ఆమెవైపు తిరిగి 'రాత్రి సినిమా కెళ్ళానోయ్ శ్యామలా — సినిమాలో జ్యోతిలక్ష్మిని చూస్తుంటే నువ్వే గుర్తుకొచ్చావు సుమీ!'

'ఏమండీ' సాధ్యమయినంత పెద్దగా అరిచింది.

'వ్హాట్—ఏం జరిగింది.'

'అదికాదు నేను మీ కంటికి అలాగా...'

'అదా ఐ మీన్ అది కాదోయ్, చూడగానే భార్య గుర్తుకొచ్చిందని నా ఉద్దేశ్యం'

'అదా! పాపం ఎవరిపిల్లోగానిండి చాలా మంచిదిలాగుంది. ఇంటిని, ఇల్లాలిని మరిచిపోయినవాళ్ళకి వాటిని గుర్తుచేస్తోంది.'

భోజనాలయినాక మళ్ళీ గదిలో చేరాడు సారథి. కళ్యాణి శ్యామలకి కంచంలో అన్నం పెట్టి తీసుకొచ్చి ఆమె ముందుపెట్టి కూర్చుంది.

'ఏం బావా, మీ పాపాయికి పేరేం పెడతావు?' అంటూ లోపలికి వచ్చాడు పెద్ద బావమరిది శ్రీనివాసు.

మాట్లాడలేదు సారథి.

'రహస్యం లేరా అన్నయ్యా. కీ పొల్యూషన్ బ్యాంకులో దాచినట్లు భద్రంగా దాచుకున్నాడు. పోనీ అక్కయ్యకి తెలుసా?'

సారథి మాట్లాడలేదు.

భద్రం వచ్చాడు — వాడు చిన్న బావమరిది. 'బావ మాట్లాడాలంటే ఒక బ్లాక్‌బోర్డు, చేతికొక చాక్‌పీసు ఇవ్వాలని చెప్పారా లేదా! అప్పటిదాకాని లెక్చరిచ్చే మూడ్‌లోకి రాడు— రోజూ అలవాటుగా!'

'అతి వాగుతున్నాడుగాని బావా, వెధవని బెంచెక్కించు' అంది కళ్యాణి.

'దాన్ని ముందు క్లాసులోంచి బయటికి పంపించేయండి మాస్టారూ, విప్పారూ మమ్మల్ని విమర్శిస్తుంది.'

'వాళ్ళ కాలేజీలో బెంచి ఎక్కించలు కూడా ఉన్నాయట తెలుసా?'

'నిజంగానా బావా?'

టాపిక్ మారిపోయిందనిపించింది భద్రానికి. 'మీ ఊరి ఇలవేలుపు కనకదుర్గ కదా బావా! శుక్రవారం పుట్టింది కనకలక్ష్మి' ఉండాలి. ఇప్పుడు అదృష్టం కలగాలంటే అందరూ 'విజయ' తగిలిస్తున్నారు పేరుముందు. కనుక 'విజయలక్ష్మి కనకదుర్గ' అని పెట్టేయమంటోంది అమ్మ. మొత్తం అడ్రసు వచ్చేస్తుందందులో!'

'తలుచుకుంటే బాధపడేట్లు ఉండకూడదంటాను. మనకున్న ఫాన్సీలు, నమ్మకాలూ, వాళ్ల మీద రుద్ద కూడదంటాను. పెద్దయినాక వాళ్లు మనల్ని, మన మూఢనమ్మకాలని తలుచుకుని బాధపడకూడదంటాను. పేరు చెప్పుకునేందుకు సిగ్గుపడే స్థితి వాళ్లకి రానీయ కూడదు.'

'వ్రాయవలసిన దేమయినా ఉంటే టాక్‌పీసదిగో బావా, ఆ అలమారుమీద రాసేయ్ ఫరవాలేదు' అన్నాడు శ్రీను.

'సస్పెండ్ చేయి బావా వీడిని!'

'ష్. అయితే ఏటువంటి పేరు కావాలంటావు బావా?' అడిగింది కళ్యాణి.

'చెప్పకూడదు.'

'అంత సిగ్గుపడే పేరా?'

'పేరు తలుచుకుని సిగ్గుపడవలసిన వాళ్ళు మీ ఇంట్లో వాళ్ళు. మీరు పిలుస్తుంటున్న మీ పేర్లకి ముందు ఒక్కొక్కళ్ళకి వి స్తసి పేర్లున్నాయి. ఏం భద్రం నీ పేరు మొత్తం రాయాలంటే పావుతాపు సరి పోతుందా? నీవీ ఆడపిల్లకదా కళ్యాణి పేరు మొత్తం చెప్పాలంటే రాదో యే పెళ్ళికొడుకు గుమ్మం దగ్గర పావుగంట నిలబడాలి.'

'సరే, రకరకాల దేవుళ్ళు, పెద వాళ్ళు లిందర్ని తృప్తిపరిచేసరికి ఇంతింత పేర్లవు తాయి. ఎవరి ఇబ్బందులు వారివి. ఏమే అక్కయ్యా?'

'అవునవును.' అంది శ్యామల.

'నాన్సెన్స్. అటువంటివనే చేయ కూడదు' అన్నాడు సారథి.

'అయితే చెప్పటానికేం విని ఆనందించే వాళ్లమేగా!'

'ముందుగా పేపరవుటనకూడదు.'

అందరూ నవ్వేశారు...

మధ్యాహ్నానికి సారథివాళ్ల బామ్మ వచ్చింది. వస్తూనే సారథిని వి దలేపి 'నా తండ్రీ, నా కన్నా ముందే వచ్చావురా చూసేందుకు. అమ్మ యెక్కడుంది? లక్ష్మి పుట్టిందిరా— ఎన్నాళ్ళకెన్నాళ్లకి ఆడ పిల్ల మనింట్లో!' అంటానే సంబరపడి పోతూ కాళ్ళు కడుక్కుని పురిటి గదిలోకి చేరుకుంది.

'అదేమిటే అమ్మ. పథ్యం తిని నిద్ర పోతున్నావు? లే, లే, భలే దానివే! పసి కట్టు బిగించుకోవడం ఎలాగ! మీఘావన్ను అవీ మా కొద్దే తల్లి, వక పాత్రంలాగా అయిపోతే బాధపడేది నా మనవడు—అసలే అర్భకుడు వాడు. ఏదీ మా లక్ష్మి... ఆసిసీ, అమ్మదగ్గర దాక్కున్నావా?' అంటూ పసి దాన్ని చేతుల్లోకి తీసుకుంది.

'ఇంటినిండా మగ వెధవలయిపోయి ఆడపిల్లకి ముఖం వాచినట్టయింది.' ఆవిడికి ఒక్కడే సంతానం సారది వాళ్ళ నాన్న. ఆయనకి ఇద్దరూ మగపిల్లలే!

'ఇదేమిటి పిల్లకి ఆముదం రాయలేదా? భలేవాళ్ళు! ఏది ఆ సిసాలోది ఆముదమేనా—వళ్ళు పెళుసెక్కిపోతుందే ఇప్పటినుంచి వెధవ ప్లీడర్నురాస్తే!...కాటుకపెట్టలేదూ అదేమిటే లక్షణంగా ఆడపిల్ల పుడితేను' అంటూనే ఆముదం ఒత్తుగా పట్టిం చేసింది

సారథికి తనవంటికి పట్టినట్టున్నట్టుగా అనిపించింది 'ఊరగ్గా ఉండి ఏమన్నుంటదేమోనే బామ్మా'

'ఏడిశావు, దానికి తెలుసేమిటి? నీకు చెబితే రాయించుకున్నావేమిటి చిన్నప్పుడు ఆ ఎదంలో నానేవాడివి రోజల్లా!'

కళ్యాణి పక్కున నవ్వేసింది 'ఈమాట పెద్దగా అన్నారంటే మీ మనవడికి కాలేజీలో అదే పేరు పెట్టేస్తారు—ఇప్పుడున్నది చాలక.'

'ఎవడా పెట్టేది, నాదగ్గరకు తీసుకొస్తే డొక్కచీలికలు చేస్తాను.'

'రాక్షసిలాగుంది, అంత కాటుక పెట్టా రేమిటమ్మమ్మగారూ' అంది కళ్యాణి పాపాయి వంక చూస్తూ.

సారథికి ఆమాటలు నచ్చలేదు. వాళ్ళ బామ్మచేసింది రైటనిపించిందతనికి. కళ్ళ నిండా కాటుకపెడితే అది కదలడంలో బుగ్గలకి అంటుకుని చక్కగా ఉంది పాపాయిత నికి 'రోజా అలా కాటుక పెట్టాలి తెలుసా? నాకూ ఇష్టమే!' అన్నాడు శ్యామలతో.

'నేను లేమరా నాన్నా నీకెందుకు ఏమే అమ్మాయి, మీరే చిన్నపిల్లలు — మీకు పసిపిల్లల్ని పెంపడం తెలుస్తుందా ఏమ స్తుందా...మా సారథి ఎలికలాగా ఉండే వాడు చిన్నప్పుడు.'

'బామ్మా, బామ్మా!' అన్నాడు ఉడుకుగా సారథి.

'పోనీలే బావా, ఎలుకల్లో కొంచెం అందమయిన ఎలుకనుకో. చెప్పండమ్మమ్మ గారు, కాబట్టి పుట్టినప్పటినుంచి అలాగే ఉండేవాడన్నమాట' అంది కళ్యాణి.

'ఆసిసీ, ఎంత మేనత్తకొడుకయినా నా మనవడికే వంకలుపెడుతున్నావా. అటువంటి వాడు ఎన్నిపూజలుచేస్తే వస్తాడే నీకు!'

'పూజలుచేస్తే వచ్చేవాళ్ళిటువంటి వాళ్ళే అయితే అవికూడా ఎందుకు దండగ!'

'రోజుకు నాలుక్కాగులు వేడినీళ్ళు పోసే దాన్ని వీడికి—స్తంభంగా నలుగెట్టి ఏడాది వచ్చేసరికి పట్టపండులా తయారయ్యాడు.'

పిల్లకి మాలీషులు చేయడం అయేసరికి ఆది సొమ్మసిలి నిద్రపోయింది. అప్పుడు స్నానంచేసి పట్టుచీర కట్టుకుని 'నాన్నా—సారథీ' అని పిలిచిందావిడ.

'ఏమిటే బామ్మా.'

మంచం ఒకటి వాల్చుకుని 'రారా నాన్నా, అలా దబ్బనంలా అయిపోయా వేమిట్రా? అన్నానూ, మీ తాతయ్యచేత ఉత్తరం రాయించాను కదా—పిల్ల పెంబుడు నీళ్ళు పోసుకుని తిరిగి వచ్చేదాకా రెండు నెలలు శలవు పెట్టి ఇంటికొచ్చెయమని'

'ఎలా వస్తాడే బామ్మా, నాలుగేళ్ళ నుండి అలా వచ్చాడే కదూ!... తాతయ్య రాలేదేమని?'

'మీనాన్న ఉత్తరం రాశాడు వెంటనే రమ్మనమని. ఆయనటు వెళ్ళారు. నేనిటు పిల్లని చూసిపోదామని వచ్చాను' అని నవ్వి 'మీ నాన్నకి డబ్బు తీసుకువెళ్లారు తాతయ్య. ఆయనతో పోట్లాడి నేన్నీకు తెచ్చాను.'

సారథి ముఖం విప్పారింది. 'ఎంత తెచ్చావే బామ్మా?'

'ఎంత కావాలేమిట్రా నీకు?'

'రేడియో కొనుక్కోవాలే!'

'ఉంది కదురా — మీ మావగారిచ్చాడుగా!'

'అదికాదు లేవే, ట్రాన్సిస్టర్ కావాలి!'

'మంగలిపెట్టా?'

'ఆఁ ఆఁ అదే లే మూలొందబంటే మంచిదౌస్తుంది.'

'కళ్ళుమూసుకుని చేయిపట్టు.'

'ఊఁ' అన్నాడు చేయిపట్టి సారథి.

బొందిన దాపుకున్న నోట్లకట్ట తీసి అతని చేతిలో పెట్టిందావిడ. కళ్ళు తెరిచిన

# పెన్నిధి

సారథి 'బామ్మా!' అన్నాడాశ్చర్యంగా.

'పిల్లకి మెడలో గొలుసు, మామిడి పిందెల మొలత్రాడు చేయించమని వేయి రూపాయలు ఇచ్చారు తాతయ్య.'

సారథికి ఉత్సాహం వచ్చేసింది. 'అవునే బామ్మా, నిన్ను మా ఊరు రమ్మన్నాను కదా! డాక్టరుకి చూపించి చేతులు వణకడం తగ్గటానికి మందులు రాయిస్తానన్నాను కదా!' అన్నాడు నిష్ఠురంగా.

'వస్తాలేరా నాన్నా, అమ్మాయొచ్చాక! ముందాడబ్బాయి ఇప్పుడు కంసాలి పిలిపించి ఆర్డరిచ్చి వెడతాను — బారసాలనాటికి తయారయిపోవాలి. అవునుగానోరేయ్ పిల్లకి పేరేం పెడతావురా?'

'రాజ్యలక్ష్మి. ఉట్టి 'లక్ష్మి'అని పెడితే సినిమాల్లో పనిమనుషులు గుర్తుకొస్తారే అందుకని 'రాజ్య' కూడా కలిపాను. బావుందా?'

'అదేమిట్రా నాన్నా, పెద్ద మనవడివి! తాతయ్యని మరిచిపోతే ఎలారా?'

తెల్లబోయాడు సారథి 'అదికాదే...'

'ఏదికాదు? నీ ముఖం. పూర్వపు రోజుల్లో అయితే పదేసిమంది పిల్లల్ని కనే వాళ్ళు కనుక ఒకరికి కాకపోతే ఒకరికి పెట్టుకునేవారు. ఇప్పుడిద్దరేసెగా! తప్పునాన్నా! పెద్దవారు; మీ నాన్న ప్రయోజకత్వమేనా నీ చదువు? చూస్తూనే ఉన్నావుగా— తాతయ్య ఆస్తి సంపాయించకపోతే అడుక్కుని తినేవాడు మీ నాన్న. ఫ్యాక్టరీమీద ఆయన సంపాదన ఆయన సొదరుకి చాలదు. రెండు తరాలదాకా వెతుక్కోనవసరం లేకుండా సంపాయించాడు తాతయ్య! ఏమంటావు?'

'అవుననుకో—అయినా పేరు చిన్నదిగా ఉండాలని...'

'మరి చిన్నపేర్నంటే దిష్టి తగులుతుంది. నాయనా! పైగా మీ తాతయ్య పేరు కలుస్తుంది బాగా.'

'అవుతే తాతయ్య పేరు రాధాకృష్ణమూర్తి కదా—'రాధ' కలపమంటావా దీని పేరుకి?'

'రాధ కాదురా నాన్నా 'కృష్ణ' కూడా కలుపు.'

'అదేమిటే, రాధాకృష్ణ అంటే మగ పేరయి పోవడంలే?'

'మరి చిత్రంరా నీది. 'రాధాకృష్ణ రాజ్యలక్ష్మి'అని పెట్టు. ఫస్టుగా ఉంటుంది. నువ్వనుకున్న పేరుకూడా బాగుంది.'

అవాక్కయి పోయాడు సారథి.

'నీ కెందుకురా నాన్నా, పిల్లకి మురుగులు, ఉంగరంకూడా చేయిస్తాగా తాతయ్యకి చెప్పి' అన్నది ఆవిడే మళ్ళీ.

'అలాగే లేవే!' అనేశాడు సారథి.

'మా తండ్రే!...పిల్ల ఏడుస్తోంది, మీ ఆవిడకి నిద్ర ఎక్కువ. పోయిచూడు' అందావిడ నిద్రకుపక్రమిస్తూ.

సాయంత్రం పెద్ద బావమరిది శ్రీనివాసు పిలిచాడు సారథిని. 'అలా షికారు పోదాం రారాదూ బావా, ఏం తోస్తుంది ఆడవాళ్ళలాగా ఇంటిలో కూర్చుంటే' అంటూ.

నిజానికి సారథికి కదలాలని లేదు. భార్యతో కబుర్లు చెపుతూ, కొత్తగా వచ్చిన కూతుర్ని చూస్తూ కూర్చోవాలనే ఉంది. అయినా పౌరుషం వచ్చి బయలుదేరాడు.

'ఎటువెడదాం?'

'ఏటేమిటి బావా, ఇక్కడొక బాబా గారున్నారు— అటుకేసి'

'నా కిష్టం ఉండదు.'

'ఆయన దగ్గరక్కాదు. అటువెళ్ళే రోడ్డు బాగుంటుంది.'

ఇద్దరూ సైకిళ్ళేసుకుని బయలు దేరారు. శ్రీనివాసు చెప్పినవైపు వెళ్ళే రోడ్డు నిజంగానే చాలాబాగుంది సారథికి. రెండు ప్రక్కలా సరుగుడు తోటలు, అవి దాటాక రెండు వైపులా చేలు పంటకాలువలు మధ్యన పక్కాటి తారు రోడ్డు.

'బావా బావా పాము' అన్నాడు శ్రీనివాసు. ఖంగారుపడిపోయి సైకిలు మీదనుంచి దూకాడు సారథి.

'అదుగదుగో' చేత్తో చూపించాడు శ్రీనివాసు. రోడ్డువారగా జరజర పాక్కుంటూ వెడుతోంది.

'అదేమిటోయ్' అన్నాడు మరోవైపు చూపించి సారథి.

'ఏముంది, అదికూడా పామే! కదలకు నిలబడిపో—చూశావా నీ సైకిలుకి అడ్డంగా మరోపాము పాకుతోంది.'

గుండె గుబేలుమంది సారథికి. దాని కడ్డంగా ఖంగారులేకుండా పడుకునుంది పాము. 'పదపద తిరిగిపోదాము' అన్నాడు సైకిలు వెనక్కి తిప్పుకుని.

'ఆగు మరి, అదుగదిగో అటు చూశావా?'

డింకీషాపులో అద్దాలలో వేలాది ప్రతిబింబాలు అగపడినట్టయింది సారథికి. ఎటు చూసినా పాములే!

ఇంటికొచ్చేసరికి కోయవాడొకడు గుమ్మంలోనే ఎదురయాడు. సారథిని చూస్తూనే 'దొరకి దండాలు. ...ముఖం చూసి చెప్పగలను దొరా, జరిగింది, జరగబోయేది! కూన పుట్టినది దొరా నీకు—లక్ష్మి పుట్టింది దొరా! బలంలేదు పిల్లకి, అర్భకురాలు నాగరాజు కనబడినాడు దొరా నీకు' అన్నాడు.

సారథి తెల్లబోయాడు.

'భయంలేదులే దొరా నీకు దోషంవచ్చింది అందుకనే గుర్తుచేసిందు స్వామి! పిల్లకి పేరుపెట్టుకొమ్మని గుర్తుచేసిందు. పెట్టు పెట్టు—ఎదురులేదు దొరా నీ కూనకి! మహాజాతకురాలు—లక్ష్మి! ఉద్యోగం పెద్ద దవుతుంది నీకు. అమ్మ కడుపున ఇంకా రెండు కూనలుంటాయి...పుంజాలేలే!' అన్నాడు కోయదొర.

'అవునోయ్ చెయిచూస్తావా ఈయనది' అన్నాడు శ్రీనివాసు.

'వద్దులే దొరా! కోయరాజులం, ముఖం చాలు మాకు! నాగరాజుని తొక్కిందిలే అమ్మ. అందుకే కాస్త కోపం మీదున్నాడు. స్వామి పేరెట్టుకుని ఈ తాయెత్తు కట్టు దొరా పిల్లకి. చల్లబడతాడు.'

సారథి ఏమీ మాట్లాడకపోవడం చూసి వాడికి రెండు రూపాయలు చేతిలోపెట్టి తాయెత్తు తీసుకున్నాడు శ్రీనివాసు. వాడు వెళ్ళిపోయాక 'ఆఁ, వీళ్ళని నమ్మకూడదులే బావా, ఎందుకయినా మంచిదని తీసుకున్నా నంతే! లేకపోతే ఏమయిపోతావేమోనని భయం వేసింది.'

'మనకి దారిలో పాములగపడ్డాయని వాడి కెలా తెలుసు అసలు' ఆశ్చర్యంగా అడిగాడు సారథి.

'వీళ్ళనలా కొట్టిపారెయ్యడానికి వీల్లేదు బావా, భలే కరెక్టుగా చెబుతారొక్కొక్క సారి! మనమెక్కడో చూసినవి వాడు చూసినట్టు చెప్పగలగడం వింతే మరి! వీళ్ళకేదో ఉపాసనలుంటాయి.'

'అవునవును.'

'మా ప్రెండుకి ఒకసారి ఇలాగే ఏదో చెప్పాడు కోయవాడు. వీడు లెక్కపెట్టకుండా చెప్పినది చేయలేదు. అంతే నాసుకో ఎన్ని అవస్థలుపడ్డాడని!'

'సర్లే, సర్లే, ఇప్పుడవన్నీ చెప్పబోకు మనం మీ స్నేహితుడిలాగా చేయబోవడం లేదుగా, భయందేనికి?'

'అవున్లే ఏందుకయినా మంచిది వాడు చెప్పినది చేస్తేపోయె.! ... అబ్బబ్బ ఎన్ని పాములగవడ్డాడో.'

సారథి ఆలోచిస్తూనే లోపలికి వెళ్ళాడు. పురిటిగదిలో వాళ్ళ అమ్మమ్మ అగపడింది అతనికి. 'నువ్వెప్పుడొచ్చావమ్మమ్మా?' అనడిగాడు.

'ఇప్పుడేరా నాయనా, ఉత్తరం వేశాడు మీ మామగారు. ఉన్నపళంగా బయల్దేరి వచ్చేశాను, అసలు వెళ్ళక వెళ్ళక వారం క్రితం కదిలాను—ఇంతలోనే నీ కూతురు పుట్టుకొచ్చేసింది... పేరేం పెడతావురా దీనికి?'

మాటాడలేదు సారథి.

'అమ్మ మొక్కుకుంది చెప్పిందోలేదో నీకు! సలక్షణంగా జరిగితే ఏడుకొండలవాడిపేరు వచ్చేలా పెడతానని.'

కాసేపు మాట్లాడకుండా ఉండిపోయాడు సారథి. చివరికి 'అలాగే' అన్నాడు నీరసంగా మనసులోమాత్రం కలుపవలసినవన్నీ కలుపుకుని. 'అయ్యో బాబోయ్ ఎంత పేరయిపోయిందో?' అనుకున్నాడు.

కళ్యాణి వచ్చిందంతలో 'బామ్మోయ్, ఇందాక వీళ్ళ బామ్మవచ్చి మనవడ్ని చాటుకు తీసుకుపోయి వాళ్ళ తాతయ్య పేరు పెడితే పిల్లకి ఏడువారాలనొమ్ములు వేయిస్తానంది.'

'ఎంతిచ్చిందేమిటా సారథీ.'

'గొలుసుకి, మావిడిపిందెలుట వాటికేను మురుగులు. ఉంగరం చేయిస్తానంది.'

'ఆసిసి, అసాధ్యురాలురా మీ బామ్మ! ఆవిడకేం లక్ష్మీ తాండవిస్తుంటుంది ఎప్పుడూ ఎంతయినా ఇస్తుంది.'

'మరి నువ్వుకూడా పేరుచెప్పి ఏదయినా సమర్పించుకోవమ్మా— యాత్రాస్పెషల్ లోలా ముందుగా డబ్బుకట్టి పేరు నమోదు చేయించుకోవాలి. లేకపోతే ఖాళీలుండవు మళ్ళీ.'

'నాకు అంత తాహతెక్కడుందే అమ్మా, అయినా ఏడుకొండలవాడి పేరేగా మా తాతయ్యదీను.'

'ఏం బావా ఇంకెక్కడయినా డబ్బులిచ్చే బేరాలుంటే చూడమంటావా? తరువాతి పిల్లాడికి ఇప్పటినుంచి అడ్వాన్స్ బుకింగ్ పెట్టేద్దాం! అన్నట్టు బామ్మా. తరువాత మగ పిల్లాడే పుడతాడుట బావకి—ఇందాక కోయదొర చెప్పాడు.'

'నువ్వెప్పుడు విన్నావు?' ఆశ్చర్యంగా అడిగాడు సారథి.

'నేనా!' అని కాసేపాగి ఫక్కున నవ్వి 'నేనూ ఒక కోయదొరనుకోరాదూ. చూడనివి చూసినట్టు నేనూ చెప్పగలను. సరా!...ఇప్పుడు మా బామ్మ నీ కూతురికి వందరూపాయలిస్తుందని కూడా చెప్పగలను'

'ఎందుకు?'

'ఎందుకేమిటి బావా, పెద్ద మనవరాలికి మొదటి కూతురు. దేముడి పేరుతో మా తాతయ్య పేరు ఎటూ కలుస్తుంది.'

'నువ్వాయకోవే! నేన్నీకు వంద ఇద్దామనుకున్నారా అబ్బి—నా మనవరాళ్ళకందరికీ ఇలా ఇవ్వడం నా కలవాటు. ఇంకా బతికే ఉన్నాను కదా ఈనాటికి. సరే వాళ్ళ పిల్లలికికూడా నేనున్నంత వరకు ఇస్తాను'

'భలే అదృష్టవంతుడివి బావా, నీ కూతురు పేరుచెప్పి ఇప్పటికి పదకొండు వందలు కొట్టేశావు అప్పనంగా! ఇంకా వాగ్దానాలున్నాయి.'

'నువ్వుకూడా చప్పున పెళ్ళిచేసుకోరాదూ!'

'నా పిల్లల్ని చూసినమీదట నీ సంతానం వంక కనీసం కన్నెత్తి చూసేవాళుండరు. అందుకని జాలేసి ఆగిపోయాను.'

'నా కూతురులాంటిదాన్ని తపస్సు చేసినా కనగలవుటే' అంది శ్యామల నవ్వుతూ.

'అదేమిటిలే, కాకిపిల్ల కాకికి ముద్దు. అందుకే నేను బావనేమీ తప్పు పట్టటం లేదుగా' అంది కళ్యాణి.

మర్నాడు పొద్దున్న ఇంట్లో ఇచ్చిన కాఫీ, టిఫిన్ సరిపోక బజారుకి బయలుదేరాడు సారథి. 'భద్రం వస్తావా' అనడిగాడు వరండాలోనే నిలబడి ఉన్న బావమరిదిని.

'వద్దామనేగా నిలబడింది. ఈ పురుడు హడావుడిలో పడి భోజనాలాలస్యం అయిపోతున్నాయి. కనుక నువ్వే నాకు టిఫిన్ పెట్టించాలి!'


'పాపం భయపడిపోయి తను తినడం మానేస్తాడేమో — బావనికూడా తిననును భద్రం' అంది కళ్యాణి.

'నీక్కూడా తెమ్మంటావా ఇంటికి' అని నవ్వుతూ బయటికి నడిచాడు సారథి.

వాళ్ళ కాలేజి విషయాలు చెబుతూ ఒక హోటల్లోకి దారితీశాడు భద్రం. 'ఇదేందుకోయ్ బావున్నట్టు లేదు' అన్నాడు సారథి.

'లేదు బావా, ఇక్కడ ఇడ్లీ ప్రత్యేకం. నెయ్యికూడా మంచిది వేస్తారు. ముఖ్యంగా గోల ఉండదు.'

లోపలికి నడిచారు. భద్రం సారథి వేయి



పెట్టుకుని 'అదుగో బావా, ఆమూల కూర్చున్నాడే ఆయన జాతకాలు బాగా చూస్తాడు. నీకు నమ్మకం ఉంది కదూ!'

'అవుననుకో, అయినా కుర్రాడిలా ఉన్నాడు.'

'లేదు బావా,' బాగా తెలిసినవాడు. ఊరికే అలా చూసి చెబుతాడుట! మా ఫ్రెండు నాన్నగారికి ఇతనంటే బాగా గురి. నేనూ ఈయన్ని వాళ్ళ ఇంటిలోనే చూశాను. పరిచయం ఉంది—మాట్లాడదామా?'

'పద.'

అతనికేసి వెళ్ళారు. భద్రం 'నమస్కారమండి. ఈయన మా బావగారు' అంటూ సారథిని పరిచయం చేశాడు.

'టీచింగ్ ప్రొఫెషన్ కదూ?'

సారథి ఆశ్చర్యపోయాడు.

అతను నవ్వి 'వింతలేదు లెండి. నేనే కాదు, లెక్చరర్సని ఎవరు చూసినా చెప్ప గలరు— వాళ్ళ చూపుల్లోనే ఉంటుందది. కనబడిన వాళ్ళనందరినీ విద్యార్థుల్లాగావే చూస్తారు.'

'మా బావగారికి జ్యోతిషంమీద నమ్మకం బాగా ఉంది' అన్నాడు భద్రం.

'సంతోషం. తెలిసినవారు కనుక నమ్మ తారు. అరమిరి జ్ఞానం వారికే ఈ నమ్మకాలు లేకపోవడమన్నది. ఇటీసెన్సైన్స్— కాదనగలవారెవరు ?'

'కరెక్ట్. నా అభిప్రాయం కూడా అదే! మోసం చేసేవాళ్ళు ఎక్కువయిపోయి అసలు శాస్త్రాన్నే అనుమానించేలా చేస్తున్నారు... మీరి పేరేమిటన్నావు భద్రం?'

'నాపేరు అతనెరగడు. చైనులంటారు నన్ను.'

'అవుతే ఈ జ్యోతిషం అన్నది వంశ పారంపర్యంగా వస్తున్నదా ఏమిటి మీకు?'

నవ్వాడతను 'మా నాన్నగారు చక్రం వేయడం వగైరాలు నేర్పారు. నేను హస్త సాముద్రికం నేర్చుకున్నాను. తరవాత రెండూ కలుస్తే కరెక్ట్ రీడింగ్స్ ఇవ్వచ్చు నని నా అభిప్రాయం.'

సారథికి చేయి చూపించుకోవాలన్న కోరిక కలిగింది ... కాని జంకాడు. అది గ్రహించిన భద్రం 'మా బావగారి చేయి చూడండి' అన్నాడు.

కాసేపు పరకీలనగా చూసి 'ఇద్దిపర కెక్కడన్నా చెప్పించుకున్నారా?'

'లేదండి. ఉట్టి కుతూహలం తప్పించి ఎవరిదగ్గరా చేయిచూపింది లేదు. మీ దగ్గరనే మొదలు'

ముగ్గురూ నవ్వుకున్నారు.

'మీది మంచి జాతకమండి, జీవితంలో కష్టపడి ఎరగరు. కాలు మీద కాలేసు కూర్చున్నా దివ్యంగా జరుగుతుంది ... విదేశయానం కూడా ఉంది మీకు.'

'నిజంగానా? ఎప్పుడు'

'కరెక్ట్ రీడింగ్ రావాలంటే మీ జనన కాలం కావాలి. హారోస్కోపుంటే మంచిది. అన్నట్టు మీకిప్పటికి ఒక సంతానం ఉండి ఉండాలే — మూడుపాళ్లు ఆడ పిల్లయి ఉండాలి!'

'అవునండి ఈ రోజుకి నాలుగు రోజు లయింది' అన్నాడు సారథి.

'పాపాయి జాతకం చూస్తారేమిటి సార్?' అడిగాడు భద్రం.

'సరయిన టైము చెబుతే. పుట్టిన కాలమన్నమాట!'

'ష్యూర్, ష్యూర్' అంటూనే చెప్పాడు సారథి.

అతనొక కాగితం తీసుకుని కాసేపు చక్రం వేశాడు. లెక్కవేసి 'తరవాత తాపీగా చూసి చెబుతాను. జాతకం మాత్రం చాలా మంచిది. యోగ జాతకం. ఎటువంటి హడావుడులూ ఉండవు. ఆరోగ్యవంతురాలు... పేరేం పెడదామని?'

భద్రం సారథి వంక చూశాడు. సారథి నవ్వుతూ 'నేననుకున్నది 'రాజ్యలక్ష్మి' అని. అదల్లా పెద్దవాళ్ళ వత్తిడి వలన పెరుగు తోందనుకోండి!' అన్నాడు.

'దట్స్‌గుడ్. ఇవన్నీ సహజం ... పేరు పెరుగుతూంటే భయం లేదు. మరీ చిన్న పేరు పెడతారేమోనని భయపడ్డాను — ఎలాగా చెప్పటమని. ఎటూ పెద్దదే కనుక నేను చెప్పినది కూడా కలపండి. 'పద్మావతి అలివేలు' అని. బాగా యోగిస్తుంది అమ్మాయికీపేరు'

మాట్లాడ లేదు సారథి.

'నాకు తెలుసు మీకు నచ్చదని. కాని సార్, ఇప్పుడు మన దక్షిణాది రాష్ట్రాలకి ఇలవేలుప్పు ఎవ రంటారు?'

'వెంకటేశ్వరుడు'

'అవునా? ఆయన లేనిదే వివాహ జరగడం లేదు కదా. ఆఫీసర్ని ప్రసన్ను లని చేసుకోవాలంటే వాళ్ళకి కానుక లివ్వాలిట! అలాగే ఆ స్వామిని ప్రసన్నుడ్ని చేసుకునేందుకు ఆయన దేవేరుల పేర్లు తగిలించాలి! ఇక మన పోషణ భారం ఆయనదే అవుతుంది. అమ్మాయిది చాలా మంచి జాతకం. కొంచెంగా దోషాలున్నాయి. వాటిని దీనితో పోగొట్ట వచ్చును. ఎందుకు చెప్పానో వినండి! ఆ రెండు పేర్లూ కల పండి. పిలవడమె మరోపేరుతోనే పిలుస్తారు కదండీ— జరుగుతుంది. పూర్తి రీడింగ్ తరవాత చూద్దాం.'

అందరి బిల్లు సారథి ఇచ్చాక బయటికి నడిచారు ముగ్గురూ.

బారసాల పీటలమీద అన్నాడు సారథి శ్యామలతో 'నేనసలు పాపకి 'రాజ్యలక్ష్మి' అని పెడదామనుకున్నానోయ్' అని.

వెనకనుంచి కళ్యాణి ఫక్కున నవ్వింది 'ఛీ, ఫో', అన్న మనిషిమీద నీకెందుకు బావా ఇంత అభిమానం?'

'అంటే!' అంది శ్యామల వింతగా.

'అదేనక్కయ్యా, రాజ్యలక్ష్మి అన్నపిల్లని చూసేందుకు వెళ్ళాడట బావ. చాలా బావుం దిట. చేసుకుందామని ముచ్చటపడితే ఆ అమ్మాయికీయన నచ్చలేదుట. అదీ ఈయన మమకారం.'

'ఏమండీ ఇదంతా నిజమేనా?' అంది శ్యామల.

'అయితే ఏంచేయమంటారేమిటి, చివరికి ఈ పేరుకూడా మార్చెయమంటారా? సరే 'స్వరాజ్యలక్ష్మి' అంటాను సరా? నిండా మునిగిన నాకింకా చలేమిటి' అని పురో హితుడివైపు తిరిగి 'ఇదుగో పంతులు గారూ పళ్ళెంలో బియ్యంపోసి నన్ను పేరు రాయమంటే కుదరదు. ఒక బస్తా బియ్యం నేలమీద పోయించండి రాయడం మొదలెడతాను' అన్నాడు.

'ఒకటి కాకపోతే రెండుబస్తాలు పోయి స్తాను. నాకొచ్చేవేగా' అన్నాడు పంతులు గారు ఉత్సాహంగా.

'పేరు వినండి—నాగ వెంకటరాధాకృష్ణ పద్మావతీ అలివేలు స్వరాజ్యలక్ష్మి. వ్రాయడం ఆపేస్తున్నాను. ఇంకా ఎవరి కయినా కోరికలుంటే చెప్పండి కలిపేస్తాను!' అన్నాడు.

భోజనాలయినాక శ్యామల వడిలో నిద్ర పోతున్న పాపాయిజాట్సుతో ఆడుకుంటున్నవాడల్లా లోపలికివస్తున్న ఒకతన్ని చూసి 'అడుగో శ్యామలా. అతను మంచి జ్యోతిష్కుడు పిలవనా' అన్నాడు.

'ఎవరూ, ఆ చారల చొక్కాయేనా?'

'అవును పిలవమంటావా?'

నవ్వింది శ్యామల 'వాడు జ్యోతిష్కుడేమిటండి నా ముఖం! భద్రానికి క్లాసుమేటు. పిలుస్తానుండండి' అని పెద్దగా 'సుబ్బారావు, ఇటు రావోయ్' అని పిలిచింది.

తెల్లబోయాడు సారధి.

క్షణంలో సుబ్బారావు వచ్చి 'నమస్కారం బావగారు' అన్నాడు నవ్వుతూ.

ఆ వెనకే భద్రం, శ్రీనివాసు, కళ్యాణి వచ్చేశారు లోపలికి.

'ఇప్పుడిక బహుమతి ప్రదానం మిగిలింది బావా, కోయవాడి వేషం వేసింది భద్రం. కాలేజిలో కూడా వాడి వేషానికి ఫస్టు ప్రయిజు వచ్చింది. జ్యోతిష్కుడు సుబ్బారావు—భద్రం ఫ్రెండు. ఇంకా ఎవళ్ళురా?' అని నవ్వుతూ 'సరే, సమర్పణ కళ్యాణి అనబడే నేను' అంది కళ్యాణి.

సారధికి వింతగా ఉంది. 'మరి పాములు?' అన్నాడు.

నవ్వాడు శ్రీనివాసు 'ఆ రోడ్డులో ఏరోజున సాయంత్రంపూట వెళ్ళినా అన్నీ పాములూ అగపడతాయి. అన్నీ బురద పాములు! ఆ రోడ్డు విషయం మాకు తెలుసు నీకు తెలియదు.'


'హోరిని ఎన్ని నాటకాలాడారు?'

'పేర్లు పెట్టడంలో మన కోరికల్ని మించిన శక్తులు చాలా ఉంటాయన్నది ఈ నాటకానికి నీతి' అంది కళ్యాణి.

'నీక్కాదు, మా అమ్మమ్మ కూడా నాటకం ఆడింది. మీ అమ్మగారు వెంకటేశ్వరస్వామికి మొక్కుకోలేదట! ఆవిడే ఆ అబద్ధం ఆడి మా తాతయ్య పేరు కలిసేలా చేసుకుంది!' అంది శ్యామల.

సారధికి ఉక్రోషం వచ్చేసింది. 'నాన్సెన్స్, అసలే పేర్లేసి పిలవకుండా 'పాపాయి' అంటాను నాకు వళ్ళుమండితే' అన్నాడు కసిగా. ●

# కర్మత్రయం—ధర్మపథం



బులుసు వేంకటసుబ్రహ్మణ్యయ్య

సంసారబంధం నుంచి విడుదల పొందడానికి, మానవులు తాము పూర్వజన్మలోను, ఈ జన్మలోను, భవిష్యత్తులోను చేసుకున్న ఫలాన్ని తగులు, మిగులు లేకుండా అనుభవించాలనీ, ఆ కర్మలు సంచితం, ప్రారబ్ధం, ఆగామి—అని మూడువిధాలనీ ఇదివరలో ఒకసారి తెలియ చేయబడింది.

ఆ విధంగా కాకుండా కర్మలను మరో రీతిని మూడువిధాలుగా పెద్దలు విభజించి ఉన్నారు.

అవి నిత్యములూ, నైమిత్తికములూ, కామ్యములూ అని.

ప్రతినిత్యమూ చేయవలసిన కర్మలు నిత్యకర్మలు.

మనం ప్రతిరోజూ నిద్ర లేచిన తర్వాత కొన్ని పనులను క్రమంగా చేసుకుంటు న్నాము. బహిర్భూమికి పోయిరావడం, దంతధావన చేసుకుని ముఖం కడుక్కోవడం, స్నానం చేసుకోవడం, భోజనాదులు జరుపుకుని, జీవికకు కావలసిన ఉద్యోగాదులను నిర్వర్తించుకోవడం పరిపాటి. అవి క్రమంగా జరగకపోతే ఆరోగ్యం చెడిపోతుంది. జీవయాత్ర జరపడం కష్టమవుతుంది. ఆ పనులు మనకు ఎంత అవసరమో నిత్యాదులైన కర్మలు కూడా అంత అవసరమే!

ఆయా మతాలను అనుసరించి నిత్యాలయిన దైవప్రార్థన, సంధ్యావందనం మున్నగునవి కర్మలుంటాయి. ఆ నిత్యకర్మలను నిర్వర్తిస్తే ప్రత్యేకమైన ఫలం ఏమీ ఉండదు. కాని, వాటిని జరపకపోతే విహిత ధర్మాన్ని నిర్వర్తించని పాతకం మాత్రం చుట్టుకుంటుంది. అందువల్ల నిత్యకర్మలను నెరవేర్చడం అవసరమే!

ప్రతిదినం కాకుండా — అప్పుడప్పుడు నియమిత సమయాల్లో నిర్వర్తించవలసిన కర్మలు కొన్ని ఉంటాయి. పితృకార్యాదులైన శ్రాద్ధములు, సంక్రాంతులలో జరుపవలసిన తర్పణములు మున్నగునవి. నిమిత్తాల మూలంగా జరుపవలసిన కర్మలగుటవలన వాటికి నైమిత్తికాలని పేరు. వీటిని జరపడమూ ఆవశ్యకమే! జరపకపోతే ప్రత్యవాయం కలుగుతుంది.

మూడోరకం కర్మలు కామ్యకర్మలు. అంటే ఏదో ఒక కోరికతో నెరవేర్చేవి. పూర్వం జరుపుతూ వుండే రాజసూయం మొదలయిన యాగాలు, పుత్రకామేష్టి మొదలైన ఇష్టులు, తమ కోరిక నెరవేరే సంకల్పంతో చేసే పూజలు, నోములు వ్రతాలు మొదలైనవన్నీ కామ్యకర్మల కిందికి లెక్కకు వస్తాయి.

ఏదో కోరికతో చేసే కర్మకంటె నిష్కామమైన కర్మ ఉత్తమమయిందని అందరికీ తెలుసును. విహితకర్మలను నెరవేర్చడం ప్రధానం. వాటిని క్రమంగా జరపకపోతే పాతకం సంభవిస్తుంది కూడా.

అందువల్ల కర్మాచరణలో మన దృష్టిని విహిత కర్మలవైపే మరల్చవలసి ఉంటుంది. ●